సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 12 । మే । 2023



కన్నెర్ర చేసిన ప్రకృతి

జిల్లాలో గురువారం సాయంత్రం ఈదురు గాలులకు తోడు వర్షం కురవడంతో చెట్లు, స్తంభాలు నేలకూలగా ధాన్యం తడిసింది. 10లో



భాషా ప్రమాణాల పెంపు..

విద్యార్థుల్లో భాషా ప్రమాణాల పెంపునకు శతక పద్యాలు దోహదం చేస్తాయని విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన అన్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
42° / 24°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం వాతావరణం కాస్త చల్లగా ఉంటుంది. ఆతర్వాత ఎండ మొదలై మధ్యాహ్నానికి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పోలీసు శాఖ ఆధ్వర్యాన 21న మెగా జాబ్‌మేళా



జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించిన సీపీ, అధికారులు

ఖమ్మంక్రైం: పలు ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీల్లో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈనెల 21న పోలీసు శాఖ ఆధ్వర్యాన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. జాబ్‌మేళా పోస్టర్లను కమిషనరేట్‌లో సీపీ గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐటీలో నిర్వహించే జాబ్‌మేళాలో సుమారు నాలుగు వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. అర్హులైన యువతీ యువకులు స్థానిక పోలీసు స్టేషన్లలో ఈనెల 18వ తేదీలోగా స్వయంగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్, సీసీఆర్బీ ఏసీపీ వెంకటస్వామి, సీఐ తుమ్మా గోపి, హెచ్‌ఆర్ చందు పాల్గొన్నారు. కాగా, వివరాల కోసం 87126 59238(తిరుపతి, ఆర్‌ఐ), 87126 59234(రవి, ఆర్‌ఐ), 87126 59234(సతీష్, ఆర్‌ఎస్‌ఐ), 90009 37805(చందర్, హెచ్‌ఆర్) నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గురుకుల ఉపాధ్యాయ శిక్షణకు దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన గురుకుల ఉపాధ్యాయ శిక్షణ కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.శ్రీలత తెలిపారు. డిగ్రీ, బీఈడీలో పొందిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామని, ఆసక్తి ఉన్న వారు ఈనెల 25వ తేదీలోగా టీఎస్ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ 1వ తేదీ నుండి మొదలయ్యే శిక్షణ కాలంలో స్టడీ మెటీరియల్, స్టైఫండ్ ఇస్తామని, వివరాల కోసం ఖమ్మంలోని బీసీ స్టడీసర్కిల్‌తో పాటు 08742–227427, 95738 59598 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

31లోగా డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజనల్ సెంటర్ పరిధిలో డిప్లొమా కోర్సులు ప్రవేశపెట్టినట్లు కోఆర్డినేటర్ డాక్టర్ జకీరుల్లా తెలిపారు. ఈమేరకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 31లోగా ఫీజు చెల్లించాలని సూచించారు.

వన్యప్రాణుల కదలికలపై డ్రోన్ నిఘా

- డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్



పనులను పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్, అధికారులు

సత్తుపల్లిటౌన్: వన్యప్రాణుల కదలికల గుర్తింపు, అటవీ సంరక్షణకు డ్రోన్‌తో నిఘా వేయాలని, తద్వారా అక్రమార్కులకు అడ్డుకట్ట వేయొచ్చని జిల్లా అటవీశాఖాధికారి(డీఎఫ్‌ఓ) సిద్ధార్థ విక్రమ్‌సింగ్ సూచించారు. సత్తుపల్లి రేంజ్‌లో అటవీ అభివృద్ధి పనులను ఎఫ్‌డీఓ మంజులతో కలిసి గురువారం పరిశీలించారు. తామర చెరువు సమీపాన 65 హెక్టార్ల అటవీ భూమిలో ప్లాంటేషన్‌ను పరిశీలించి మొక్కలు పెంపకం, నీటి కుంటలు, రాతి కట్టడాల ఏర్పాటుకు ఆదేశించారు. ఆతర్వాత అర్బన్ పార్క్‌ను కూడా పరిశీలించారు. రేంజర్ ఎ.వెంకటేశ్వర్లు, ఎఫ్‌ఎస్‌ఓలు మంగారావు, నర్సింహ, ఎఫ్‌బీఓలు నర్సింహారావు, ముత్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రీకౌంటింగ్, వెరిఫికేషన్‌కు 16వరకు దరఖాస్తులు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ విద్యార్థులు మార్కుల్లో సందేహాలు ఉంటే రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈనెల 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు. రీ కౌంటింగ్ ఒక్కో సబ్జెక్టుకు రూ.100, రీ వెరిఫికేషన్‌కైతే సబ్జెక్టుకు రూ.600 చొప్పున చెల్లించి tsbie.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాగా, వచ్చే నెల 4వ తేదీ నుంచి జరిగే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఈనెల 16 తేదీ వరకు సంబంధిత కళాశాలల్లో ఫీజు చెల్లించాలని డీఐఈఓ తెలిపారు.

వాన పేరిట దోపిడీ..

ఖమ్మం మార్కెట్‌లో మిర్చి వ్యాపారుల సిండికేట్

- ధర తగ్గించడంతో రైతులకు 'అకాల' నష్టం
- క్వింటాకు రూ.4వేల నుంచి రూ.5 వేల మేర కోత



ఖమ్మం మార్కెట్‌లో టార్పాలిన్లు కప్పిన మిర్చి బస్తాల వద్ద రైతులు

ఖమ్మంవ్యవసాయం: అకాల వర్షంతో పంట తడిసిపోతోందని రైతులు ఆవేదన చెందుతుండగా.. ఇదే కారణం చెప్పి వ్యాపారులు ధర తగ్గించారు. గురువారం ఉదయం 6:30 గంటల సమయాన ఖమ్మంలో ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో అమ్మకానికి తీసుకొచ్చిన మిర్చి బస్తాలు కొంతమేర తడిశాయి. ఇదే అదునుగా మిర్చి తడిసి నాణ్యత తగ్గిందని, చివరి కోత కావడంతో పనికి రాదని సాకులు చెబుతూ దగాకు చేశారు. అయినప్పటికీ దూరప్రాంతాల నుంచి వచ్చిన రైతులు చేసేదేం లేక వ్యాపారులు చెప్పిన ధరకు అమ్ముకుని నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది.

సిండికేట్ మాయాజాలం

మార్కెట్ కమిటీ లెక్కల ప్రకారం 23,780 బస్తాల మిర్చి విక్రయానికి రాగా, రోజు మాదిరిగానే గురువారం ఉదయం నిర్వహించిన జెండా పాటలో మిర్చికి రూ.23,051 గరిష్ట ధర పలికింది. దీంతో రైతులు ఆనందపడ్డారు. కానీ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి దగా చేశారు. అకాల వర్షానికి మిర్చి బస్తాలు తడవడంతో నాణ్యత దెబ్బతింటుందని, చివరి కోత పంట కావడంతో సరిగ్గా లేదని కుంటి సాకులు చెప్పి కొనుగోళ్లు సాగించారు. గరిష్ట ధర రూ.23 వేలకు పైగా పలకడంతో రూ.వెయ్యి తగ్గినా రూ.22వేల వరకు వస్తుందని రెండో కోత పంట రైతులు, రూ.20వేల ధర అయినా దక్కుతుందని మూడో కోత రైతులు ఆనందించగా, నిరాశే మిగిలింది. ఏకంగా క్వింటాకు రూ.4వేల నుంచి రూ.5 వేల వరకు తగ్గించడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోయారు. గురువారం ఒక్క రోజే ఖమ్మం మార్కెట్‌లో వ్యాపారులు తగ్గించిన ధర విలువ రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు ఉంటుందని అంచనా.



నిండిపోయిన షెడ్లు..

ఈనెల 15వ తేదీ నుంచి ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు ప్రకటించడంతో అమ్మకానికి రైతులు మిర్చి భారీగా తీసుకొస్తున్నారు. బుధవారం రాత్రి నుంచి వచ్చిన మిర్చి బస్తాలతో యార్డులోని షెడ్లు నిండిపోగా.. గురువారం తెల్లవారుజామున వచ్చిన రైతులు షెడ్ల మధ్య, యార్డు ఖాళీ స్థలంలో బస్తాలు దింపుకున్నారు. ఇంతలోనే అరగంట పాటు వర్షం కురవగా రైతులు ఉరుకులు, పరుగులపై టార్పాలిన్లు తెచ్చి కప్పినా కొందరి బస్తాలు వానకు తడిశాయి.



వర్షం కురుస్తుండగా తడుస్తున్న మిర్చి బస్తాలు

రూ.16,500 ధర పెట్టారు



మార్కెట్‌కు సెలవులని తెలియడంతో 72 బస్తాల మిర్చి తీసుకొచ్చా. వర్షానికి తడవకుండా కాపాడడంతో రూ.20 వేల వరకు ధర పలుకుతుందని ఆశించాను. కానీ వర్షం పేరిట వ్యాపారులు రూ.16,500గా ధర చెప్పడంతో ఏం చేయాలో పాలుపోక అమ్ముకున్నా.

– వేసాల సూర్యనారాయణ, రేపల్లెవాడ, చింతకాని మండలం

పేరుకే జెండా పాట



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో జెండా పాట ఉన్నా అది అమలుకావడం లేదు. జెండా పాటకు దగ్గరలో ధర లభిస్తుందని ఆశించా. కానీ వ్యాపారులంతా ఏకమై పంట నాణ్యతగా ఉన్నా క్వింటాకు రూ.20,500లే ధరగా నిర్ణయించారు. మరికొంత పెంచాలని ఎంత కోరినప్పటికీ అదే ఎక్కువ అన్నట్లుగా వ్యవహరించారు.

– ఎన్నబోయిన నాగయ్య, నేలకొండపల్లి

తర్వాత అమ్ముకుందామని వెళ్తున్నా



47బస్తాల మిర్చి విక్రయానికి తీసుకొస్తే కొన్ని తడిశాయి. కిలో చొప్పున కోత పెడతామని చెబుతూ క్వింటాకు ధర రూ.20,500గా ధర నిర్ణయించారు. దీంతో తక్కువ ధరకు అమ్ముకోవడం ఇష్టం లేక శుక్రవారం విక్రయించడానికి నిర్ణయించుకుని వెళ్లిపోతున్నాను.

– వరికొల్లు వసంతరావు, ముచ్చర్ల, కామేపల్లి మండలం

చివరి గింజ వరకు కొంటాం..

మొక్కజొన్న కొనుగోళ్లను ప్రారంభించిన మంత్రి పువ్వాడ



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ, ఎంపీ నామా

చింతకాని: రైతులు పండించిన చివరి మొక్కజొన్న గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. చింతకాని సొసైటీలో ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతుల నుంచి పంటను గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలనే లక్ష్యంతో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులను ఆదుకునేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, సీఎం కేసీఆర్ నేతృత్వాన అకాల వర్షాల వలన తడిచిన ధాన్యాన్ని సైతం మద్దతు కొనుగోలు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ నామా నాగేశ్వరరావు, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరావు, జెడ్పీ, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు లింగాల కమల్‌రాజ్, కూరాకుల నాగభూషణం, శేషగిరిరావు, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరావు, డీసీఓ విజయకుమారి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

కన్నేశారు... తోడేస్తున్నారు!

- రాత్రీపగలు తేడా లేకుండా మట్టి తవ్వకాలు
- ప్రభుత్వ భూములనూ వదలని అక్రమార్కులు
- కాసులు కురిపిస్తుండడంతో యథేచ్ఛగా దందా
- అయినా దృష్టి సారించని రెవెన్యూ, మైనింగ్ అధికారులు

ఖమ్మంరూరల్: అక్రమాల్లో ఆరితేరిన కొందరు... దొరికినంత దోచుకునే పనిలో పడ్డారు. కబ్జాకు కాదేది అనర్హం అన్నట్లుగా కుంటలు, మట్టి గుట్టలను, ప్రభుత్వ భూములను సైతం వదలకుండా గుల్ల చేస్తున్నారు. కనిపించిన మట్టిని భారీ యంత్రాలతో తవ్వి రాత్రీపగలు తేడా లేకుండా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇళ్ల నిర్మాణాలు, వెంచర్ల ఏర్పాటుకు మట్టి డిమాండ్ ఉండడంతో కాసులు కురిపిస్తున్న నేపథ్యాన అక్రమార్కులు దందా సాగిస్తున్నారు. ఖమ్మం రూరల్, అర్బన్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఈ దందా యథేచ్ఛగా సాగుతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. కొద్దిరోజులు అధికారుల కంటపడకుండా రాత్రి వేళ, సెలవు రోజుల్లో మట్టి తరలింపు చేపట్టిన కొందరు ఇప్పుడు రాత్రీపగలు తేడా లేకుండా పని కానిచ్చేస్తున్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని ఆరెకోడు, కాచిరాజుగూడెం, ఎం.వెంకటాయపాలెం, గుర్రాలపాడు, పల్లెగూడెం, గోళ్లపాడు, ముత్తగూడెం, ఆరెంపుల, తెల్దారుపల్లి గ్రామాల్లోని మట్టి గుట్టలపై కన్నేసిన వారు జేసీబీలతో తవ్వించి టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ట్రాక్టర్‌కు రూ.400 నుండి రూ.500 వరకు, టిప్పర్‌కు రూ.2వేలు నుండి రూ.2,500 వరకు విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్న వారు ప్రభుత్వ భూములను గుల్ల చేస్తున్నారు.

చక్రం తిప్పుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

మట్టి అక్రమ రవాణాలో కొందరు ప్రజాప్రతినిధులు, అధికార, విపక్ష పార్టీలకు చెందిన నాయకులు చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. ఇలా దందాలో తిలా పాపం, తలా పిడికెడు అన్నట్లుగా ప్రజాప్రతినిధులు, నాయకులు పాలుపంచుకుంటుండడంతో అక్రమార్కులకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. గోళ్లపాడు, పల్లెగూడెం తదితర గ్రామాల పరిధిలో జంకూబొంకూ లేకుండా రేయింబవళ్లు మట్టి తరలించి రూ.లక్షలు గడిస్తున్నారు. ఎవరైనా ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేస్తే అధికారులను బెదిరించి లేదంటే మచ్చిక చేసుకునైనా పని చేస్తున్నారు తప్ప దందా ఆపడం లేదు.

పర్యావరణం, రోడ్ల సంగతేంటి?

అక్రమార్కులు ఇష్టానుసారం మట్టి తవ్వుతుండడంతో పర్యావరణం దెబ్బతింటోందని, వాహనాల రాకపోకలతో రోడ్లు గుల్ల అవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. నిత్యం మట్టి తరలించే వాహనాల రద్దీతో రోడ్లపై పెద్దపెద్ద గుంతలు పడి ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా ఉంది. అలాగే, మట్టిలోడుతో అతివేగంగా వెళ్తున్న ట్రాక్టర్లు, టిప్పర్ల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ముత్తగూడెంలో మట్టిలోడు ట్రాక్టర్ ఓ వ్యక్తిని ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు ఎందుకు పట్టించుకోకపోవడం లేదో వారికే తెలియాలని స్థానికులు అంటున్నారు.



ఎం.వెంకటాయపాలెంలో ప్రభుత్వ భూమి నుంచి మట్టి తరలించిన చోట ఆనవాళ్లు

మట్టి తరలింపును అడ్డుకుంటున్నాం..

ఎక్కడైనా అక్రమంగా మట్టి తవ్వకం, తరలింపు జరుగుతోందనే సమాచారం తెలిస్తే తనిఖీలు చేపడుతున్నాం. ఈ విషయంలో రాత్రీ, పగలు ఎప్పుడు ఫిర్యాదు అందినా స్పందిస్తున్నాం. ట్రాక్టర్లు, జేసీబీలను సీజ్ చేయడమే కాక వాహనాల యజమానులకు జరిమానా విధిస్తున్నాం. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదు.

– టి.సుమ, తహసీల్దార్, ఖమ్మం రూరల్

అభివృద్ధి పనులను పరిశీలించిన శిక్షణా కలెక్టర్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులను 2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన శిక్షణా కలెక్టర్లు గురువారం పరిశీలించారు. శిక్షణలో భాగంగా ఖమ్మం వచ్చిన వారు నగరంలోని గోళ్లపాడు చానల్, పార్కులు, మార్కెట్లను సందర్శించగా కమిషనర్ ఆదర్శ్ సురభి వివరాలను వెల్లడించారు. అనంతరం కేఎంసీ కార్యాలయంలో కమిషనర్ ఆదర్శ్ సురభి వారితో సమావేశమై అభివృద్ధి పనులతో పాటు పాలనాపరమైన వ్యవహారాలపై వివరించారు. ఖమ్మం, మంచిర్యాల, మహబూబాబాద్, కామారెడ్డి, వికారాబాద్, కరీంనగర్ జిల్లాల శిక్షణా కలెక్టర్లు రాధికగుప్తా, పి.గౌతమి, పర్మర్ పినకేశ్‌కుమార్, లలిత్‌కుమార్, వివేంద్ర ప్రతాప్, సంచిత్, లెనిన్ వత్సాల టొప్పో పాల్గొన్నారు.



గోళ్లపాడు చానల్ వివరాలు వెల్లడిస్తున్న కేఎంసీ కమిషనర్ ఆదర్శ్



కల్లూరు స్టేడియంలో షటిల్ ఆడుతున్న శిక్షణా కలెక్టర్లు

కల్లూరు మినీ స్టేడియం పరిశీలన

కల్లూరు రూరల్: కల్లూరులో రూ.3.40కోట్లతో నిర్మించి ఇటీవల ప్రారంభించిన మినీ స్టేడియం శిక్షణ కలెక్టర్లు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సౌకర్యాలను పరిశీలించి కాసేపు క్రీడాకారులతో షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు. ఆర్డీఓ సీహెచ్.సూర్యనారాయణతో పాటు డాక్టర్ లక్కినేని రఘు, వీరరాఘవయ్య, పసుమర్తి చందర్‌రావు పాల్గొన్నారు.

సర్వీస్‌ను క్రమబద్ధీకరించాల్సిందే..

కలెక్టరేట్ ఎదుట జేపీఎస్‌ల ధర్నా



జేపీఎస్‌ల సమ్మె శిబిరంలో వివిధ పార్టీల నాయకులు

ఖమ్మం సహకారనగర్: నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్ ముగిసిన నేపథ్యాన సర్వీస్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్) డిమాండ్ చేశారు. ఈమేరకు అసోసియేషన్ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నాచౌక్‌లో గురువారం ధర్నా నిర్వహించారు. వీరి ధర్నాకు సీపీఎం, ప్రజాపంథా, ఐఎఫ్‌టీయూ నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. ఆయా పార్టీలు, సంఘాల నాయకులు నున్నా నాగేశ్వరరావు, గోకినేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పల్లెల ప్రగతిలో కీలకమైన జేపీఎస్‌ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు సైదులు, నాయకులు నాయకులు రామయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చర్చలు జరపాలి

ఖమ్మంమయూరిసెంటర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు 14 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్న నేపథ్యాన ప్రభుత్వం వారితో చర్చలు జరిపి డిమాండ్లు పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయడమే కాక ఇతర సమస్యలు పరిష్కరించాలని, సమ్మెపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా, అణచివేత వైఖరిని విడనాడాలని సూచించారు.

ప్రశాంతంగా ఎంసెట్

ఖమ్మం సహకారనగర్: ఎంసెట్‌లో భాగంగా రెండో రోజైన గురువారం అగ్రికల్చర్, మెడికల్ ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఖమ్మంలోని ఆరు కేంద్రాల్లో ఉదయం పరీక్షకు 1,249మందికి 1,188మంది (95.12శాతం), సత్తుపల్లిలోని రెండు కేంద్రాల్లో 300మందికి 278మంది(92.67శాతం) హాజరయ్యారు. అలాగే, మధ్యాహ్నం ఖమ్మంలో 1,250మందికి 1,202మంది(96.16శాతం), సత్తుపల్లిలోని కేంద్రాల్లో 300మందికి 282మంది(94 శాతం) హాజరయ్యారని అధికారులు వెల్లడించారు.

26లోగా పరీక్ష ఫీజు చెల్లించండి

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు వచ్చే నెల 14నుంచి 20వ తేదీ వరకు జరగనుండగా, విద్యార్థులు ఈనెల 26లోగా ఫీజు చెల్లించాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. పరీక్ష ఫీజు మూడు పేపర్లకు రూ.110, ఆపైన రూ.125 చెల్లించాల్సి ఉంటుందని, అపరాధ రుసుము రూ.50తో పరీక్షకు రెండు రోజుల ముందు వరకు కూడా ఫీజు చెల్లించి పాఠశాల నుంచి హాల్‌టికెట్ తీసుకోవచ్చని డీఈఓ వెల్లడించారు.

నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో స్వామి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

అటవీ అభివృద్ధి, సంరక్షణ భేష్

కిన్నెరసానిని సందర్శించిన పీసీసీఎఫ్ డోబ్రియల్

పాల్వంచరూరల్ : భద్రాద్రి జిల్లాలో అటవీ సంరక్షణ, ప్లాంటేషన్ అభివృద్ధి పనులు బాగున్నాయని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) ఆర్.ఎం. డోబ్రియల్ అన్నారు. మండల పరిధిలోని కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని కలెక్టర్ అనుదీప్, ఎస్పీ వినీత్, ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు, సీసీఎఫ్ భీమానాయక్‌తో కలిసి గురువారం డోబ్రియల్ దంపతులు సందర్శించారు. డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించి జలాశయంలో బోటింగ్ చేశారు. ఎన్విరాన్‌మెంట్ భవనంలో జిల్లా అటవీ ఫిల్మ్ డాక్యుమెంటరీ డిస్‌ప్లేను ఆయన ప్రారంభించారు. అనంతరం డివి జన్ కార్యాలయంలో అటవీ అధికారులతో సమావేశం నిర్వహించి అడవుల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు పీసీసీఎఫ్ దంపతులను ఘనంగా సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. ఈకార్యక్రమంలో డీఎఫ్‌ఓ రంజిత్ లక్ష్మణ్ నాయక్, ఎఫ్‌డీఓలు కట్టా దామోదర్‌రెడ్డి, తిర్మల్‌రావు, రేంజర్లు శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాపిక అందజేస్తున్న అధికారులు, పక్కన భద్రాద్రి కలెక్టర్ అనుదీప్, ఎస్పీ వినీత్, పీఓ గౌతమ్ తదితరులు

క్లుప్తంగా

నేటి నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: దివంగత సీఎం ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సినీ హీరో నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఖమ్మంలో శుక్రవారం నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు మొత్తం 16 జట్లు హాజరవుతున్నాయని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నల్లమల రంజిత్ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంఅర్బన్: ఖమ్మం రామన్నపేట ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఎస్.వెంకటేశ్వర్లు(58) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన ఇద్దరు కుమార్తెలకు వివాహమై ఇతర ప్రాంతాల్లో స్థిరపడడమే కాక భార్య చనిపోవడంతో ఒంటరిగా ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. దీంతో మనస్తాపంతో బుధవారం ఇంట్లో ఎలుకల మందు తాగగా, గుర్తించిన స్థానికులు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. ఈ ఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

నీటి సంప్ గోడ కూలి వ్యక్తి మృతి


స్వామి మృతదేహం

కల్లూరు: కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న భవనానికి సంబంధించి నీటి సంపు గోడ గురువారం కూలడంతో అంబేద్కర్‌నగర్‌కు చెందిన మేకల స్వామి(55) మృతి చెందాడు. ఆస్పత్రి ఆవరణలోని సంప్ నుంచి నీళ్ల తీసుకురావడానికి ఆయన బిందెతో వెళ్లగా ప్రమాదవశాత్తు గోడ కూలి మీద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆయన కుటుంబీకులను పరామర్శించారు. ఎంపీపీ బీరవల్లి రఘు, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్‌తో పాటు డాక్టర్ లక్కినేని రఘు, పసుమర్తి చందర్‌రావు, కాటమనేని వెంకటేశ్వరరావు, పెడకంటి రామకృష్ణ, కొరకొప్పు ప్రసాద్ పాల్గొన్నారు.

వడదెబ్బతో ట్రాలీ కార్మికుడు మృతి


వీరకోటయ్య కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పనిచేసే ట్రాలీ కార్మికుడు ఆడెపు వీరకోటయ్య(47) వడదెబ్బకు గురై బుధవారం రాత్రి మరణించారు. మార్కెట్‌లో బుధవారం కూడా పనిచేసిన ఆయన ఎండ తీవ్రత కారణంగా రాత్రి వరకు అస్వస్థతకు గురై మృతి చెందినట్లు సహచర కార్మికులు తెలిపారు. ఖమ్మం చెరువుబజార్ మాణిక్యనగర్‌లోని ఆయన ఇంటి వద్ద మార్కెట్ కార్మిక సంఘాల నాయకుడు సున్నా మాధవరావు తదితరులు గురువారం ఉదయం నివాళులర్పించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. నాయకులు యర్రం రాంరెడ్డి, ఎస్.కే.యాకూబ్ పాషా, వడ్డే వెంకన్న, జంగం లక్ష్మయ్య, ఎస్.కే.షరీఫ్, బి.వీరబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు


ప్రధాన రహదారిపై పరిశీలిస్తున్న సీఐ అంజలి

వైరా: జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఖమ్మం ట్రాఫిక్ సీఐ ఎస్.అంజలి సూచించారు. ఖమ్మం నుండి వైరా, మధిర ప్రధాన రహదారిపై తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గురువారం ఆమె పరిశీలించారు. ప్రధానంగా వైరా క్రాస్ రోడ్డులో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నందున ఖమ్మం నుండి వచ్చే వాహనాలు నేరుగా బస్టాండ్ వైపు కాకుండా యూ టర్న్ తీసుకునేలా బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఎస్ఐ వీరప్రసాద్ పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	1,630	1,100
పెసలు	7,400	5,000
మిర్చి	23,051	12,500
మిర్చి తాలు	12,700	8,000
పత్తి	7,350	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,205

కన్నెర్ర చేసిన ప్రకృతి

- జిల్లావ్యాప్తంగా ఈదురుగాలులు, అకాల వర్షం
- విరిగిపడిన విద్యుత్ స్తంభాలు.. సరఫరాకు అంతరాయం
- పలుచోట్ల నేలకూలిన చెట్లతో రాకపోకలకు బ్రేక్


ముదిగొండ : చెట్టు కూలడంతో ధ్వంసమైన ఇల్లు

ఖమ్మంవ్యవసాయం: ప్రకృతి వైపరీత్యాలు జిల్లాను వెంటాడుతూనే ఉన్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం, సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. ఉదయం 6:30 గంటలకు ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. మళ్లీ 9గంటల నుంచి ఎండ తీవ్రత పెరిగి సాయంత్రం వరకు అలాగే ఉంది. ఇంతలోనే ఈదురుగాలులు మొదలై కొన్నిచోట్ల వర్షం పడింది. జిల్లా కేంద్రంతో పాటు చోట్ల విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు విరిగి పడడంతో సరఫరా నిలిచిపోయింది. రహదారులపై పెద్దచెట్లు విరిగిపడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈమేరకు విద్యుత్ శాఖ ఉద్యోగులు రాత్రి వరకు శ్రమించి కొన్ని చోట్ల సరఫరా పునరుద్ధరించినా.. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్న దగ్గర శుక్రవారం నాటికి మరమ్మతు చేస్తామని వెల్లడించారు.

స్తంభించిన ట్రాఫిక్

మధిర: మండలంలోని కృష్ణాపురం వద్ద మధిర – వైరా ప్రధాన రహదారిపై రోడ్డు పక్కనే ఉన్న చెట్టు విరిగిపడింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చివరకు కొందరు వాహనదారులు చెట్టును తొలగించాక రాకపోకలు మొదలయ్యాయి. ఇక మండలంలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో అకాల వర్షం కురవడంతో మిర్చి, ధాన్యం తడిసింది.

తడిసిన ధాన్యం

ఖమ్మంరూరల్: మండలంలోని గుదిమళ్ల, వెంకటగిరిలో గాలిదుమారం, వర్షంతో కల్లాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. రైతులు ధాన్యాన్ని కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడ్డారు.

తల్లాడలో..

తల్లాడ: తల్లాడలో కురిసిన వానతో బస్టాండ్‌లో నీరు చేరి చెరువును తలపిస్తోంది. బస్టాండ్ ఆవరణలో ఉన్న సీసీ రోడ్డు కొట్టుకుపోవడంతో ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచింది. దీంతో ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

వైరా మార్కెట్‌లో పిడుగు

వైరా: వైరాలో గాలి దుమారం బీభత్సం సృష్టించింది. ఒక్కసారిగా గాలి, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో పట్టణ వాసులు ఆందోళనకు గురయ్యారు. ఒకటో వార్డులో చర్చి పాస్టర్ అజరయ్య ఇంట్లో గోడ కూలి రేకులపై పడుతుండగా, శబ్దానికి ఆయన కుటుంబీకులు బయటకు రావడంతో ప్రమాదం తప్పింది. అజరయ్య కుటుంబాన్ని మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, బీఆర్ఎస్ నాయకుడు శివ పరామర్శించారు. అలాగే, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఆరబెట్టిన ధాన్యంపై టార్పాలిన్లు కప్పినా వరదకు కొట్టుకుపోయింది. ఇక మార్కెట్ ప్రాంగణంలోని ఓ చెట్టుపై పిడుగు పడింది.

రాకపోకలకు అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంతో పాటు రఘునాథపాలెం మండలంలోని వేపకుంట్ల తదితర గ్రామాల్లో గాలి వానతో భారీ నష్టం జరిగింది. కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న, ధాన్యం రాశులు తడిసిపోగా, చెట్లు, స్తంభాలు నేలకూలాయి. తాటి చెట్టు రోడ్డుపై పడటంతో ఖమ్మం – అల్లీపురం రోడ్డులో గంటకుపైగా రాకపోకలు నిలిపోయాయి. విద్యుత్ ఏడీ రమేష్, ఉద్యోగులు, కార్పొరేటర్ రావూరి కరుణసైదబాబు, సర్పంచ్ ధారా శ్యాం ఆధ్వర్యాన చెట్లు తొలగించి సహాయక చర్యలు చేపట్టారు.

ఎగిరిపడిన రేకులు

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి తోడు ఈదురు గాలులతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. మండలంలోని ముజ్జుగూడెంలో పలువురు ఇళ్ల రేకులు ఎగిరిపోయాయి. గ్రామానికి చెందిన ఉండమోదుగుల వెంకటేశ్వర్లు, షబ్బీర్ ఇళ్లపై రేకులు ఎగిరివచ్చి పడడంతో ధ్వంసమయ్యాయి.

పంటలను తీరని నష్టం

ముదిగొండ: మండలంలోని పలు గ్రామాల్లో గాలి, వాన బీభత్సం సృష్టించగా, చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి రోడ్లపై పడ్డాయి. పలుచోట్ల ఇంటి ప్రహరీలు నేలకూలాయి. కల్లాలో ఆరబోసుకున్న వరి, మొక్కజొన్నల తడుస్తుండడంతో కాపాడుకోవడానికి రైతులు పరుగులు తీశారు.

పిడుగుపాటుతో గొర్రెలు మృతి

ఎర్రుపాలెం: మండలంలోని పెగళ్లపాడు గ్రామంలో పిడుగు పడింది. దీంతో సగ్గుర్తి చిరంజీవికి చెందిన 11 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. దాదాపు రూ.2 లక్షల విలువైన జీవాలు కోల్పోయిన తనను ఆదుకోవాలని ఆయన కోరాడు.


వైరా : ఒకటో వార్డులోని ఇంట్లో కూలిన పైకప్పు


మధిర : రహదారిపై కూలిన చెట్టును తొలగిస్తున్న ప్రయాణికులు


నేలకొండపల్లి : ముజ్జుగూడెంలో రేకులు పడి ధ్వంసమైన ఇల్లు


ఖమ్మం రూరల్ : వర్షానికి తడిసిన ధాన్యం


తల్లాడ : బస్టాండ్‌లో నిలిచిన వరద నీరు


ఖమ్మం వ్యవసాయం : మరమ్మతు చేస్తున్న విద్యుత్ సిబ్బంది


ఖమ్మం అర్బన్ : కొత్తగూడెం-అల్లీపురం మధ్య..


ఖమ్మం అర్బన్ : అల్లీపురం వద్ద విరిగిపడిన చెట్టు, స్తంభం

అప్రమత్తతే మేలు

- గోదావరిలో లోతు అంచనా తెలియక నీట మునక
- ప్రమాద నివారణకు శాశ్వత చర్యలు చేపట్టని అధికారులు


గోదావరిలో స్నానం చేస్తున్న భక్తులు (ఫైల్)

భద్రాచలంఅర్బన్: వేసవి సెలవులు కావడంతో పిల్లలు స్నేహితులతో కలిసి సరదాగా, ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కోసం ఈతకు వెళ్తుంటారు. అయితే, ఈత రాకపోవడం, లోతు అంచనా తెలియక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇక భద్రాచలం వద్ద పలువురు యువకులు, భక్తులు గోదావరి నదిలో స్నానం చేసే క్రమంలో లోతుపై అవగాహన లేక మృత్యువాత పడుతున్నారు. గడిచిన నాలుగు నెలల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. తాజాగా ముగ్గురు యువకులు ఈతకొడుతూ నీటిలో మునిగిపోతుండగా, ఆ సమయంలో అక్కడ ఉన్న ఫొటోగ్రాఫర్లు రక్షించారు.

కొన్ని ఘటనలను పరిశీలిస్తే..

- ఈ ఏడాది ఫిబ్రవరి 20న పట్టణానికి చెందిన ఆరుగురు ఏటపాక(ఏపీ సరిహద్దు) ఉన్న మేడువాయి వద్ద గోదావరిలో స్నానానికి వెళ్లారు. వీరిలో అక్బర్ బాషా (17), పాలవర్తి వాసు(16) నీటిలో గల్లంతై మృతి చెందారు.
- ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని గడ్డికుంటకు చెందిన గుగులోత్ మనోహర్ (17) కుటుంబ సభ్యులతో కలిసి మే 7న రామయ్య దర్శనానికి వచ్చాడు. గోదావరిలో స్నానం చేస్తుండగా నీటిలో మునిగి మృత్యువాత పడ్డాడు.

రక్షణ చర్యలు శూన్యం

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి నిదర్శించుకునేందుకు ఇరు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అయితే, గోదావరిలో స్నానంచేస్తూ లోతు అంచనా ఉండక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేస్తున్న అధికారులు శాశ్వతంగా నివారణ చర్యలు తీసుకోవడంలేదు. దేవస్థానం, ఇరిగేషన్, గ్రామపంచాయతీ అధికారుల సమన్వయం లోపించి రక్షణ చర్యలు చేపట్టడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ మూడు శాఖలతో పాటు అగ్నిమాపకశాఖ, జాతీయ విపత్తు నివారణ శాఖ అధికారులు సమన్వయం చేసుకుని పక్కాగా చర్యలు తీసుకోవాలని, భక్తుల ప్రాణాలు కాపాడాలని పలువురు కోరుతున్నారు. గోదావరిలో లోతు ఎక్కువగా ఉన్న ప్రదేశాల వివరాలు తెలిసేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే ఫలితం ఉంటుందని చెబుతున్నారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

కారేపల్లి: మండలంలోని జైత్రాం తండా గ్రామంలో విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందింది. గ్రామంలో రైతు గుగులోతు సీతారాములుకు చెందిన దుక్కిటెద్దులు గురువారం ఉదయం మేతకు వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఇటీవల గాలిదుమారానికి తెగి పడిన విద్యుత్‌ను ఓ ఎద్దు తాకింది. దీంతో విద్యుదాఘాతానికి గురై సుమారు రూ.60వేలు విలువైన ఎద్దు మృతి చెందడంతో తనను ఆదుకోవాలని రైతు కోరాడు.

సత్తుపల్లిరూరల్: మండలంలోని బుగ్గపాడులో రైతు మొదుగుమూడి బాలకృష్ణకు చెందిన ఆవు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగలను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మేత కోసం పొలంలోకి వెళ్లిన క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. ఈమేరకు రూ.లక్ష విలువైన ఆవు విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో మృతి చెందిందని రైతు వాపోయాడు.

చెరువులో మునిగి వృద్ధుడు మృతి

బోనకల్: మండలంలోని రావినూతలలో ప్రమాదవశాత్తు చెరువులో పడిన మంద నారాయణ(70) మృతి చెందాడు. గేదెలు మేపేందుకు పొలానికి వెళ్లిన ఆయన తిరిగి వస్తుండగా గేదెలు చెరువులోకి దిగాయి. దీంతో వాటిని తోలేందుకు చెరువులోకి దిగిన ఆయన గుంటలో మునిగి చనిపోయాడు. మృతుడికి భార్య, ఓ కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరో ఇద్దరు యువతులకు గాయాలు
- ఎంసెట్ రాసి వస్తుండగా ఘటన


సందీప్ (ఫైల్)

కూసుమంచి: ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై లారీని వెనుక నుండి బైక్ ఢీకొట్టిన ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా వెనుక కూర్చున్న మరో ఇద్దరు యువతులకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని ధర్మాతండాకు చెందిన ఆటోడ్రైవర్ పరశురాం కుమారుడు జర్పుల సందీప్(21) తన చెల్లెలు సింధుతో పాటు గురువాయిగూడెంకు చెందిన మేనత్త కుమార్తె హరితను తన ద్విచక్ర వాహనంపై ఎంసెట్ పరీక్ష రాయించేందుకు ఖమ్మం తీసుకెళ్లాడు. పరీక్ష రాశాక ముగ్గురు తిరిగొస్తుండగా జీళ్లచెరువు సమీపాన ఫ్లైఓవర్‌పై వెళ్తున్న లారీ ఒక్కసారిగా వేగం తగ్గడంతో వెనుక వస్తున్న వీరి బైక్ లారీని ఢీకొట్టింది. ఈఘటనలో సందీప్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సింధు, హరితకు తీవ్రగాయాలు కాగా ఖమ్మం తరలించి పరిస్థితి విషమంగా ఉన్న సింధును హైదరాబాద్ తీసుకెళ్లాడు. మృతుడు సందీప్ ఇటీవలే డిప్లొమా పూర్తిచేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌కుమార్ తెలిపారు.

భాషా ప్రమాణాల పెంపునకు దోహదం


దేవసేనకు పుస్తకాన్ని అందచేస్తున్న మధుసూదన్‌రాజు, ప్రసాద్

సత్తుపల్లి: ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థుల్లో నైతిక విలువలు, మాతృభాషలో ప్రమాణాలు పెంపొందించడానికి శతక పద్యాలు ఉపయోగపడతాయని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన అన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బి.మధుసూదన్‌రాజు, పీఆర్‌టీయూ టీఎస్ విద్యావిషయక మాసపత్రిక బాధ్యుడు చిత్తలూరి ప్రసాద్ హైదరాబాద్‌లో గురువారం ఆమెను కలిసి వేమన భాషామృతం పుస్తకాన్ని అందచేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి పాఠశాలల్లో ఈ పుస్తకం ఆధారంగా బోధించడంతో సత్ఫలితాలు వచ్చాయని వివరించగా ఆమె రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. దీంతో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, డైరెక్టర్ దేవసేన, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌కు మధుసూదర్‌రాజు, ప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.

రెండు డీసీఎంలు ఢీ

ఖమ్మంక్రైం: సిగ్నల్ పడినా ముందుకెళ్తున్న ఓ డీసీఎం డ్రైవర్ ఎదురుగా వస్తున్న మరో డీసీఎంను ఢీకొట్టడంతో రెండు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఖమ్మంలోని రాపర్తినగర్ సిగ్నల్ వద్ద గురువారం ఈ ప్రమాదం జరిగింది. అయితే, వాహనాలు దెబ్బతిన్నా ఎవరికీ గాయాలు కాలేదు. ట్రాఫిక్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

సింగరేణి ఆస్పత్రిలో తనిఖీ


వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ సీఎంఓ సుజాత

మణుగూరు రూరల్ : సింగరేణి మణుగూరు ఏరియా ఆస్పత్రిని అడిషనల్ సీఎంఓ సుజాత గురువారం సందర్శించి తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని క్యాజువాలిటీ, వార్డులు, స్టోర్స్, సెంట్రల్ ఫార్మసీ, క్యాంటీన్, మెడికల్ ఓపీ, ఆపరేషన్ థియేటర్‌తో పాటు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది ఆస్పత్రిలో అన్ని సమయాల్లో అందుబాటులో ఉంటూ నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆస్పత్రి ఆవరణలో పచ్చదనం, పరిశుభ్రతను పాటించాలని చెప్పారు. అనంతరం ఏరియా జీఎం దుర్గం రామచందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో అధికారులు రమేష్, మేరికుమారి, డాక్టర్ శేషగిరి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల తీరు సరికాదు..


కలెక్టరేట్‌లో నిరసనను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏఓ శ్రీనివాసరావు

ఖమ్మం మయూరిసెంటర్/ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వాల ద్వారా మైనార్టీలకు అమలవుతున్న పథకాలపై సమీక్షించేందుకు జిల్లాకు వస్తే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై సమీక్షించేందుకు ఆమె గురువారం కలెక్టరేట్‌కు రాగా అదనపు కలెక్టర్ మధుసూదన్, అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఆర్డీఓ, మైనారిటీ అధికారులు స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్, సీపీ ఎందుకు రాలేదని ఆరా తీయగా.. ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటున్నందున మధ్యలో వస్తారని అదనపు కలెక్టర్ తెలిపారు. దీంతో షహజాది సమావేశాన్ని నిలిపివేయడమే కాక సీఎస్, రాష్ట్రపతి, డీఓపీటీకు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు.

ఉద్యోగుల నిరసన

జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు షహజాది కలెక్టర్ గౌతమ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు కలెక్టరేట్‌లో మధ్యాహ్నం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. టీఎన్జీవోస్, టీజీవోస్, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ బాధ్యులు ఈ నిరసనలో పాల్గొనగా కలెక్టరేట్ ఏఓ కారుమంచి శ్రీనివాసరావు మాట్లాడారు. కంటివెలుగు, ధాన్యం కొనుగోళ్ల తదితర అంశాల్లో బిజీగా ఉన్న కలెక్టర్ ఆలస్యంగా వస్తారని చెప్పినా వినకుండా అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. అంతేకాక మిగతా అధికారుల సమయం వృథా చేశారని ఆరోపించారు.

సీఎం రేసులో లేను

టీడీపీతో పొత్తు ఖాయమని పవన్‌కల్యాణ్ సంకేతాలు

- సీఎం పదవి కావాలని అడగాలంటే ఆ స్థాయి ఉండాలి కదా అంటూ వ్యాఖ్యలు
- నాకు సీఎం పదవి ఇస్తానని టీడీపీ ఎలా చెబుతుంది?
- జనసేన బలం తెలిశాక టీడీపీ అధ్యక్షుడి స్థానంలో నేనున్నా ఆ మాట చెప్పను
- అభిమానులు నిరాశ పడడానికి ఇదేమి సినిమా కాదు: జనసేన అధినేత



సాక్షి, అమరావతి/సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం) : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను అసలు ముఖ్యమంత్రి పదవి రేసులోనే లేనని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పరోక్షంగా తేల్చిచెప్పేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీతో జనసేన పొత్తు పెట్టుకోవడం ఖాయమంటూ సంకేతాలిస్తూ, పొత్తుల్లో జనసేన పార్టీకే ముఖ్యమంత్రి పదవి కావాలని అడగడానికి ఓ స్థాయి ఉంటుంది కదా అంటూ వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో పార్టీ నేత నాదెండ్ల మనోహర్‌తో కలిసి పవన్ గురువారం మీడియాతో మాట్లాడారు. టీడీపీతో పొత్తు చర్చలు జరుగుతున్నాయి కదా, అవి ఎంతవరకు వచ్చాయని విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. 'ఖచ్చితంగా పొత్తులు పెట్టుకుంటాం. మాట్లాడతాం. (బీజేపీని ఉద్దేశించి) కొంతమంది ఒప్పుకోకపోవచ్చు. ఒప్పిస్తాం. వాస్తవాలు, గణాంకాలు చూపి ఒప్పిస్తాం'.. అంటూ వ్యాఖ్యానించారు. ఇటీవల చంద్రబాబు–పవన్ భేటీ తర్వాత కొంతమంది జనసేన నేతలు మీరు తగ్గడం ఏమిటని, మీరు ముఖ్యమంత్రిగా అయితే తప్ప పొత్తులు పెట్టుకోకూడదని, మీరు సీఎం అభ్యర్థిగా ఉండాలి కదా అని మాట్లాడడాన్ని పవన్ తప్పుబట్టారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

30–40 సీట్లు వచ్చి ఉంటే సీఎం పదవి అడిగే వాళ్లమేమో..

ముఖ్యమంత్రి స్థాయిలో ఉంటే తప్ప పొత్తులు పెట్టుకోకూడదని అనేవాళ్లు ఎవరైనా సరే, అలాంటి ఆలోచనతో ఉంటే వారు ఒకటి గుర్తుపెట్టుకోవాలి.. జనసేన గత ఎన్నికల్లో 137 స్థానాల్లో పోటీచేసింది. ఎన్ని గెలిచాం? పొత్తుల్లో ఇతర పార్టీలను సీఎం స్థానం కోసం డిమాండ్ చేయాలంటే కనీసం 30–40 స్థానాలు ఉండాలి. అప్పుడే ఆ వాదనకు బలం ఉండేది. ఇక తాను ఇప్పటివరకూ ఎవరికైనా పెద్దన్న పాత్ర వహించాలని చెప్పానంటే అది బాధ్యత వహించడం అని అర్థం. అంతేగానీ, ఒక కులానికి సంబంధించిన వ్యవహారం కాదు. రాష్ట్రానికి సంబంధించిన వ్యవహారమది.

నాతో నడిచే వాళ్లే నా వాళ్లు..

ఇప్పుడు మీరు మాట్లాడిన మాటలకు మీ అభిమానులు, జనసేన కార్యకర్తల నుంచే విమర్శలు ఎదుర్కొనే అవకాశం ఉంటుందేమోనని ఒక విలేకరి (సాక్షి కాదు) అన్నప్పుడు.. 'విమర్శలు వస్తాయని నాకు భయాలు లేవు. అభిమానులు నిరాశ పడడానికి ఇదేమి సినిమా కాదు. కార్యకర్తలైనా సరే.. నాతో నడిచేవారే నా వాళ్లు. అర్థంచేసుకునే వాళ్లు అర్థంచేసుకుంటారు'.. అంటూ పవన్ వ్యాఖ్యానించారు.

సీఎం పదవి కావాలని కండిషన్లు పెడితే జరగవు..

ఒక మాట చెబుతున్నా.. పోయిన ఎన్నికల్లో 137 స్థానాల్లో పోటీచేశాం. 30–40 స్థానాల్లో కూడా గెలిపించలేకపోయారు. అలాంటప్పుడు మన వాదన (సీఎం పదవి కావాలనే)కు పస ఉండదు. సినిమా ల్లో నన్ను ఎవరూ సూపర్‌స్టార్ చేయలేదు. నేను సాధించుకున్నదే. రాజకీయాల్లో కూడా టీడీపీ కావొచ్చు. బీజేపీ కావొచ్చు.. నన్ను సీఎంను చేస్తామని ఎందుకంటారు. నేను టీడీపీ అధ్యక్షుడిని అయినా ఆ మాటలు అనను. మనం బలం చూపించి, సత్తా చూపించి పదవి తీసుకోవాలి. కండిషన్లు పెడితే, అవి జరగవు. సీఎం పదవి అన్నది తానై వరించాలి తప్ప నేను దాని కోసం వెంపర్లాడను. పొత్తులకు జనసేన పార్టీ పెట్టే కండిషను వైఎస్సార్‌సీపీని అధికారం నుంచి దించాలి అంతే. అలాగే, పొత్తులతో ప్రభుత్వం ఏర్పడాలి. నాదెండ్ల మనోహర్ మాట్లాడిన మాటలపై ఎవరైనా అనుచితంగా మాట్లాడితే వాటిని ఉపసంహరించుకోవాలి. ఓటు చీలనివ్వను అంటే ప్రధానంగా బలాలు ఏ పార్టీలకు ఉన్నాయో ఆ పార్టీలు కలవాలన్నది నా ఉద్దేశం. ప్రధాన పార్టీలకు సంబంధించే ఆ వ్యాఖ్యలు చేశాను. ఇక ఎన్నికలు ముందే వస్తాయని అనిపిస్తోంది. అందుకని జూన్ నుంచి రాష్ట్రంలోనే ఉండి పర్యటిస్తా.

చంద్రబాబు పల్లకీ మోయడమే పవన్ ఎజెండా

- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- కాపుల ఓట్ల కోసం పవన్‌ను ఎరగా వేసిన చంద్రబాబు
- పవన్ చెబుతున్నట్లు ప్రభుత్వ వ్యతిరేక ఓటు లేదు..



సాక్షి, అమరావతి/శంషాబాద్ (హైదరాబాద్) : టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పల్లకీ మోయడమే తన ఎజెండా అని జనసేన అధ్యక్షుడు, సినీ నటుడు పవన్ కల్యాణ్ చాటి చెప్పారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో, తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయాలలో కులాల గురించి ఆలోచించడం తప్పని, అయితే చంద్రబాబు అదే చేస్తారని ధ్వజమెత్తారు. టీడీపీకి దూరమైన కాపు సామాజిక వర్గానికి పవన్ కల్యాణ్‌ను ఎరగా వేసి.. ఓట్లు రాబట్టాలని చంద్రబాబు పథకం వేస్తున్నారని ఆరోపించారు. కానీ.. ఆ పథకం చెల్లుబాటు కాదన్నారు. కులాలపరంగా ప్రజలు ఓట్లు వేయరని.. చేసిన సేవ, విశ్వసనీయత ఆధారంగానే ఓట్లు వేస్తారని స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 151 స్థానాల్లో విజయం సాధించడం.. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడం, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టడమే అందుకు నిదర్శనమని గుర్తు చేశారు. తాను సీఎం అయితే చూడాలనుకున్న అభిమానులు, కాపు సామాజికవర్గం కలలను చంద్రబాబుకు పవన్ కల్యాణ్ తాకట్టు పెట్టారన్నారు. తమ కలలను పవన్ కల్లలుగా మార్చిన నేపథ్యంలో అభిమానులు, కాపులు వారి వెంట నడవరని స్పష్టం చేశారు. చంద్రబాబు రాజకీయ కుతంత్రంలో పవన్ కల్యాణ్ ఇష్టపూర్వకంగా బలి పశువుగా మారారని చెప్పారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..

చంద్రబాబు కోసమే జనసేన

- సీఎం వైఎస్ జగన్ కంటే ముందే పవన్ కల్యాణ్ రాజకీయ ప్రయాణం ప్రారంభించారు. చంద్రబాబు కోసమే జనసేనను స్థాపించారు. 2014 ఎన్నికల్లో పోటీ చేయకుండా టీడీపీకి మద్దతు పలికారు. 2019 ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చడం ద్వారా చంద్రబాబును అధికారంలోకి తేవాలనే లక్ష్యంతో విడిగా పోటీ చేశారు.
- జనసేన పోటీ చేసిన 137 స్థానాల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులను చంద్రబాబే ఖరారు చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబును సీఎం పీఠంపై కూర్చోబెట్టడమే ధ్యేయంగా పవన్ పని చేస్తున్నారు. రాజకీయ ప్రస్థానంలో సీఎం వైఎస్ జగన్‌లా ప్రజలతో మమేకమై.. వారి మన్ననలుపొంది, రాజకీయ శక్తిగా ఎదగాలని పవన్ ఎన్నడూ ఆలోచించలేదు. తాను రాజకీయ శక్తిగా ఎదిగితే చంద్రబాబుకు ఇబ్బంది అవుతుందని పవన్ భావించారేమో.

ఒంటరిగా పోటీ చేసే సత్తా లేకే..

- గత ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ చేసిన టీడీపీ.. గెలిచింది 23 స్థానాల్లోనే. జనసేన పోటీ చేసిన 137 స్థానాల్లో గెలిచింది ఒక్క స్థానమే. ప్రస్తుతం రాష్ట్రంలో ఒంటరిగా 175 స్థానాల్లో అభ్యర్థులను పోటీకి పెట్టలేని దుస్థితిలో చంద్రబాబు ఉన్నారు. టీడీపీ శ్రేణుల్లో నైతిక స్థైర్యం నింపడానికే పొత్తులు అంటూ పవన్‌తో చంద్రబాబు మాట్లాడిస్తుంటారు.
- 2019 ఎన్నికల్లో 30 స్థానాల్లో గెలిపించి ఉంటే.. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ జనసేన అభ్యర్థులను పోటీకి పెట్టేవాడినని పవన్ అనడం అవివేకం. జనసేన ఓటమి బాధ్యత ప్రజలపై వేయడం దుర్మార్గం. ముఖ్యమంత్రి పదవి రేసులో తాను లేనన్న పవన్.. మారీచులైన రామోజీరావు, రాధాకృష్ణ, టీవీ5 నాయుడులతో కలిసి చంద్రబాబును తక్షణమే సీఎం పీఠంపై కూర్చోబెట్టడమే తన ధ్యేయమని చాటిచెప్పుకున్నారు.
- పవన్ చెబుతున్నట్టుగా ప్రభుత్వ వ్యతిరేక ఓటు లేదు. ప్రభుత్వ సానుకూల ఓటు ఉంది. టీడీపీ తరఫున పోటీ చేయడానికే అభ్యర్థులు దొరకకే ముందస్తు ఎన్నికలంటూ బాబు డ్రామాలాడుతున్నారు. ప్రజల ఆశీస్సులతో వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయం.

క్లుప్తంగా...

జన సైనికులు, ఫ్యాన్స్‌కు పవన్ వెన్నుపోటు

రామ్ గోపాల్ వర్మ ట్వీట్



సాక్షి, అమరావతి: సొంత ఫ్యాన్స్‌నే కాకుండా, తన కాపుల్ని, తనని తానే జనసేన అధ్యక్షుడు, సినీ నటుడు పవన్ కళ్యాణ్ వెన్నుపోటు పొడిచేసుకున్నారని ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ ట్విటర్‌లో వ్యాఖ్యానించారు. ఆ రోజు ఎన్టీఆర్‌ను చంద్రబాబు వెన్నుపోటు పొడిచిన దానికన్నా దారుణంగా ఈరోజు పవన్ కళ్యాణ్ తన జన సైనికులను, ఫ్యాన్స్‌ని వెన్నుపోటు పొడిచి చంపేశారని గురువారం రాత్రి ఆయన ట్వీట్ చేశారు.

ఉదయ్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు 15కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితుడు (ఏ–6) గజ్జల ఉదయ్‌కుమార్ బెయిల్ పిటిషన్‌పై తీర్పును సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఈ నెల 15కు వాయిదా వేసింది. ఈ కేసులో గతనెల 14న ఉదయ్‌ను సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అనంతరం కోర్టు అనుమతితో ఆరు రోజులు కస్టడీలోకి తీసుకుని విచారించింది. అరెస్టయిన రెండు రోజులకే ఉదయ్‌కుమార్ సీబీఐ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం సీబీఐ కోర్టు మరోసారి విచారణ చేపట్టింది. గత విచారణ సందర్భంగా న్యాయస్థానం ఆదేశాల మేరకు కేసు డైరీని సీబీఐ సమర్పించింది. అనంతరం న్యాయస్థానం తీర్పును వాయిదా వేసింది.

అప్పులంటూ అబద్ధాలా?

- ఆర్టిస్ట్ జీవీ రావుకు ఆర్థిక నిపుణుడి ముద్ర
- అలాంటి వ్యక్తి నోటితో బాబు కోసం తప్పుడు లెక్కలు వల్లె
- ఏపీ సీఎం ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ మండిపాటు



సాక్షి, అమరావతి : రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పులపై ఈనాడు, దాని ఆర్థిక నిపుణుడు జీవీ రావు కథనం పచ్చి అబద్ధాలతో కూడుకున్నదని ఏపీ ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ మండిపడ్డారు. ఎటువంటి గణాంకాలు లేకుండా రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, అంధకారం అయిపోయిందంటూ జీవీ రావు చేసిన వ్యాఖ్యలను నిర్ధారించుకోకుండానే ఈనాడు ప్రచురించడం తీవ్ర అభ్యంతరకరమని, దారుణమని ధ్వజమెత్తారు. ఎవరికీ పరిచయం లేని వ్యక్తిని ఆర్థిక నిపుణుడంటూ అర్థం లేకుండా మాట్లాడించి.. తప్పుడు కథనాన్ని అచ్చేయడం డ్రామోజీరావు కుట్రలో భాగమని స్పష్టం చేశారు. గణాంకాలను చూపకుండానే రాష్ట్రం శ్రీలంక, పాకిస్తాన్ అయిపోయిందనడం తగదని చెప్పారు. గురువారం ఆయన సచివాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈనాడులో వచ్చిన కథనాన్ని తీవ్రంగా ఖండిస్తూ.. ఆర్‌బీఐ, కాగ్ గణాంకాలను పేర్కొంటూ అప్పులపై వాస్తవాలను వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఎవరు ఏం చెబితే అది రాసేస్తారా?

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మూడేళ్లుగా ప్రతిపక్షాలు, వాటి అనుబంధ మీడియా చేస్తున్న దుష్ప్రచారం కొనసాగింపులో భాగంగానే ఎవరికీ పరిచయం లేని వ్యక్తికి ఆర్థిక నిపుణుడనే ముద్ర వేసి నోటికి వచ్చినట్లు మాట్లాడించారు. మళ్లీ ఇదే ప్రభుత్వం వస్తే రాష్ట్రం సర్వనాశనం అయిపోతుందని చెప్పించి, దాన్ని ఈనాడులో ప్రముఖంగా ప్రచురించారు. ఆర్థిక రంగంపై కనీస అవగాహన లేని ఒక చిన్న యాక్టర్ తప్పుడు విశ్లేషణను ఈనాడు బాధ్యతారాహిత్యంగా ఎలా ప్రచురిస్తుంది?
- అప్రకటిత రుణాలు తెచ్చారని జీవీ రావు చెబితే, కనీసం వాస్తవాలు ఏమిటో తెలుసుకోకుండా ఈనాడు ఎలా రాస్తుంది? రూ. 10 లక్షల కోట్ల అప్పులు ఎక్కడున్నాయి? ఎవరు ఏం చెప్పినా, నిర్ధారించుకోకుండానే రాసేస్తారా? అలా రాయడం ఈనాడు దుర్బుద్ధి కాదా? లేక ఈనాడు రామోజీ రావే అలా అబద్ధాలు చెప్పించి, రాయించారా?
- ఆర్‌బీఐ, కాగ్ లెక్కల ప్రకారం బడ్జెట్, బడ్జెట్ బయట, ప్రభుత్వ పూచీ కత్తు, ప్రభుత్వ రంగ సంస్థల అప్పులన్నీ కలిపి రూ.6,51,789.07 కోట్లే. రూ.పది లక్షలు కోట్లు అప్పులని చెప్పడం దుష్ప్రచారం కాదా? మరి మిగతా అప్పులు ఎక్క డున్నాయో ఆ నిపుణుడు, ఈనాడు చెబితే బాగుంటుంది. రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసే కుట్రలో భాగంగానే అవాస్తవ కథనాలు రాస్తుండటం నిజం కాదా?
- ప్రభుత్వానికి సంబంధించిన డాక్యుమెంట్లన్నీ పబ్లిక్ డొమెయిన్‌లో ఉన్నాయి. వాటిని విశ్లేషించి, అవగాహనతో మాట్లాడితే స్వాగతిస్తాం. కానీ ఏ విశ్లేషణ చేయకుండా, ఎక్కడా లెక్కలు చెప్పకుండా తప్పుడు మాటలు మాట్లాడించి, ప్రచురించడం దారుణం.
- వృత్తిపరంగా అవకతవకలకు (ఒక కంపెనీ తరఫున ఆడిట్లో అవకతవకలు) పాల్పడటంతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఇండియా జీవీ రావును రెండేళ్ల పాటు సస్పెన్షన్ చేసింది. అలాంటి వ్యక్తి ఆర్థిక నిపుణుడంటూ ఈనాడు తెరపైకి తెచ్చి తప్పుడు లెక్కలు చెప్పించడం కుట్రలో భాగమే.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పేపర్లలో వచ్చిన ఫొటోలను పరిగణనలోకి తీసుకోలేం

మార్గదర్శి పిటిషన్‌లో హైకోర్టు స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో అవకతవకలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ సీఐడీ అధికారులు చేస్తున్న తనిఖీలపై పత్రికల్లో వచ్చిన ఫొటోలను పరిగణనలోకి తీసుకోలేమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. తదుపరి తనిఖీలు జరిపితే.. సంస్థ రోజువారీ కార్యకలాపాలకు ఇబ్బంది కలగకుండా చూడాలని సీఐడీని ఆదేశించింది. తనిఖీల పేరిట రోజువారీ కార్యకలాపాలను అడ్డుకుంటున్నారని మార్గదర్శి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ముమ్మినేని సుధీర్‌కుమార్ గురువారం విచారణ చేపట్టారు. ఏపీ ప్రభుత్వం తరఫున ఏజీపీ ఏటీ లలితా గాయత్రి వాదనలు వినిపించారు. తనిఖీల సమయంలో ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించడంలేదని చెప్పారు. చట్ట ప్రకారమే తనిఖీలు జరిగాయన్నారు. పారదర్శకంగా సాగుతున్న దర్యాప్తును అడ్డుకునేందుకు మార్గదర్శి ఇప్పటికే పలు పిటిషన్లు వేసిందన్నారు. పత్రికలో ఏవో ఫొటోలను ప్రచురించి ఖాతాదారులను అడ్డుకుంటున్నామని చూపించే యత్నం చేస్తోందని తెలిపారు. అలాంటి ఫొటోలను, ప్రచురణలను పరిగణనలోకి తీసుకోవద్దని కోర్టును కోరారు. ఏపీలో నమోదవుతున్న కేసులపై ఈ కోర్టు నుంచి ఉపశమనం పొందాలని భావిస్తోందని తెలిపారు. పరిధి లేని పిటిషన్లను విచారణకు స్వీకరించవద్దని, పిటిషన్‌ను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా వార్తలు

ప్లాంటేషన్‌లో అద్భుతమైన ప్రగతి

- పీసీసీఎఫ్ దోబ్రియల్
- భద్రాద్రి జిల్లాలో అభివృద్ధి పనుల ప్రారంభం

పాల్వంచ: ప్లాంటేషన్లను ఏర్పాటు చేయడంలో అద్భుతమైన ప్రగతిని సాధించామని.. రాష్ట్రంలో మాదిరి ప్రపంచంలో మరెక్కడా జరగలేదని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) ఆర్.ఎం.డోబ్రియల్ తెలిపారు. పాల్వంచలో నిర్మించిన సమావేశం మందిరం, డిప్యూటీ రేంజ్ అధికారి నివాసాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో 61 వేల ప్లాంటేషన్లను ఏర్పాటు చేయగా, ఎకో టూరిజం, అర్బన్ పార్క్‌లు, అవెన్యూ ప్లాంటేషన్‌లతో పురోగతి సాధించామన్నారు. అడవులను రక్షించడాన్ని ఉద్యోగులు బాధ్యతగా భావిస్తూ సవాళ్లను నడుమ విధులు నిర్వర్తిస్తున్నారని అభినందించారు.

అబ్బుగూడెం నర్సరీ పరిశీలన

అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి మండలం రామవరం రేంజ్ పరిధి అబ్బుగూడెం గ్రామంలోని ఫారెస్ట్ నర్సరీని పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియల్ సందర్శించారు. నర్సరీలోని మొక్కలను పరిశీలించి, మొక్కల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అలాగే, ఎండల నేపథ్యాన తీసుకుంటున్న సంరక్షణ చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అబ్బుగూడెంలోని మెగా సర్క్యూట్‌లోని 450 హెక్టార్ల ప్లాంటేషన్లు, మర్రిగూడెం బీట్‌లోని 80 హెక్టార్లలో ఏర్పాటుచేసిన వనాలను కూడా పరిశీలించారు.



అన్నపురెడ్డిపల్లి : మొక్కల పెంపకంపై సూచనలు చేస్తున్న పీసీసీఎఫ్ దోబ్రియల్



పాల్వంచ : సమావేశ మందిరాన్ని, భవనాన్ని ప్రారంభిస్తున్న పీసీసీఎఫ్

డీఆర్వో క్వార్టర్ ప్రారంభోత్సవం

ములకలపల్లి: మండలంలోని చాపరాలపల్లి శివారులో అటవీశాఖ నిర్వహిస్తున్న నర్సరీని పీసీసీఎఫ్ డోబ్రియల్ పరిశీలించి నిర్వహణపై సిబ్బందిని అభినందించారు. ఆతర్వాత మండల కేంద్రంలో రూ.23 లక్షల వ్యయంతో నిర్మించిన డిప్యూటీ రేంజ్ ఆఫీసర్(డీఆర్ఓ) క్వార్టర్స్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా పీసీసీఎఫ్‌ను ఉద్యోగులు సన్మానించారు. ఈకార్యక్రమాల్లో భద్రాద్రి సర్కిల్ సీసీఎఫ్ బీమానాయక్, డీఎఫ్ఓ లక్ష్మణ్ రంజిత్ నాయక్, ఎఫ్‌డీఓలు అప్పయ్య, తిరుమల్ రావు, నాగభూషణం, దామోదర్‌రెడ్డి, ఎఫ్ఆర్ఓ ఉమ, అనిల్‌కుమార్, రవికిరణ్, కరుణాకర్‌రెడ్డి, డీఆర్ఓ రామకృష్ణ, రాము పాల్గొన్నారు.

నేడు ఫుడ్ ప్రాసెసింగ్ మిషనరీ ప్రదర్శన

ఖమ్మంఅర్బన్: ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి పథకం–తయారీ సంస్థల క్రమబద్ధీకరణలో భాగంగా శుక్రవారం ఫుడ్ ప్రాసెసింగ్ మిషనరీ ప్రదర్శన ఏర్పాటుచేస్తున్నట్లు ఖమ్మం జిల్లా పరిశ్రమల శాఖ జీఎం కె.అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. వివిధ కంపెనీల బాధ్యులు పరిశ్రమలకు అవసరమైన యంత్రాలను ప్రదర్శించనుండగా, అర్హులైన వారికి ప్రభుత్వం 35 శాతం సబ్సిడీతో బ్యాంకు రుణాన్ని మంజూరు చేస్తుందని తెలిపారు. ఈమేరకు ఉమ్మడి జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు హాజరు కావాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం



విరాళం అందజేసిన కోట్యా దంపతులు

కూసుమంచి: మండలంలోని గోరీలపాడులో రామాలయం నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ బానోత్ కోట్యా, సత్య దంపతులు రూ.10,01,116 విరాళం అందజేశారు. విదేశాల్లో ఉంటున్నా కన్న ఊరిపై మమకారంతో భారీ విరాళాన్ని ప్రకటించిన కోట్యా దంపతులను ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్, సర్పంచ్ బానోత్ సరస్వతి తదితరులు అభినందించారు.

15 నుంచి ఖమ్మం మార్కెట్‌కు వేసవి సెలవులు

ఖమ్మంవ్యవసాయం: ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఈనెల 15 నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు ప్రకటించారు. వ్యాపారులు, కార్మిక వర్గాల వినతితో ఏటా మాదిరిగానే ఈ సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం వెల్లడించారు. ఈనెల 13న మిర్చి కొనుగోళ్లు పూర్తయ్యాక సెలవులు మొదలుకానుండగా, వచ్చే నెల 5వ తేదీ సోమవారం నుంచి మార్కెట్‌లో యథావిధిగా కొనుగోళ్లు ఉంటాయని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని వారు కోరారు.

అనాథకు అన్నీ తానై..

- చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన రాజు
- పెద్దదిక్కుగా నిలిచి పెళ్లి జరిపించిన ఎంపీ వద్దిరాజు



రాజు, ప్రతిభకు శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీ వద్దిరాజు దంపతులు

ఖమ్మంమయూరిసెంటర్: నాలుగేళ్ల వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయిన ఆ బాలుడికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర దంపతులే తల్లిదండ్రులయ్యారు. ఆ బాలుడిని అక్కున చేర్చుకుని మంచి భవిష్యత్ కల్పించారు. ఇంట్లో మనిషిలా చూడటమే కాకుండా.. గురువారం తల్లిదండ్రుల స్థానంలో నిలిచి అంగరంగ వైభవంగా వివాహం జరిపించారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన ఆకుల సత్యం – నాగమ్మ దంపతులకు కుమారుడు రాజు ఉన్నాడు. సత్యం హోంగార్డ్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. కాగా రాజు చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతి చెందగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, విజయలక్ష్మి దంపతులు చేరదీశారు. చిన్నప్పటి నుంచి అన్నీ తామే అయి పెంచి పెద్దచేశారు. ఇప్పుడు రాజు వివాహం ప్రతిభతో నిశ్చయం కాగా, ఖమ్మంలోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో గురువారం రవిచంద్ర, విజయలక్ష్మి దంపతులు తల్లిదండ్రుల హోదాలో జరిపించారు. దీంతో రాజు భావోద్వేగానికి గురి కాగా.. ఎంపీ కుటుంబీకులందరూ తమ ఇంటి పెళ్లిగానే భావిస్తూ పాల్గొని సందడి చేశారు.

నేషనల్ హైవే పనులు తనిఖీ చేసిన అధికారులు



నేలకొండపల్లి వద్ద పనులను పరిశీలిస్తున్న కేంద్ర అధికారులు

నేలకొండపల్లి: కోదాడ–కురవి జాతీయ రహదారి పనులను నేషనల్ హైవేస్ అథారిటీ అధికారి జైన్ బర్డ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం పైనంపల్లి, నేలకొండపల్లి, కొత్తూరు, సింగారెడ్డిపాలెం, గువ్వలగూడెం గ్రామాల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించిన ఆయన కూసుమంచి–నేలకొండపల్లి మధ్య వంతెన పనులపై సూచనలు చేశారు. పనుల్లో వేగం పెంచి అనుకున్న సమయానికి లక్ష్యం చేరుకునేలా చూడాలని సూచించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జాతీయ రహదారుల అథారిటీకి చెందిన రాష్ట్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఓపెన్' ప్రాక్టికల్ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్/కొత్తగూడెం అర్బన్: ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. ఖమ్మం జిల్లాకు సంబంధించి నయాబజార్ ప్రభుత్వ జూనియర్‌లో 193 మంది, కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 166 మంది పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు. పరీక్షలు ఉదయం 9–30నుంచి 12–30గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి 5గంటలకు వరకు జరుగుతున్నాయని తెలిపారు. ఇదిలా ఉండగా ఈనెల 2వ తేదీన జరగాల్సిన ఇంటర్మీడియట్ ఎకనామిక్స్ తెలుగు మీడియం పరీక్షను రద్దు చేసిన నేపథ్యాన ఈనెల 13వ తేదీ శనివారం ఉదయం 9నుంచి 12గంటల వరకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు పాత హాల్‌టికెట్‌తో గతంలో పరీక్ష రాసిన కేంద్రాలకే హాజరు కావాలని సూచించారు.

నేటి నుంచి స్పాట్

ఓపెన్ స్కూల్ సొసైటీ వార్షిక పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం శుక్రవారం నుంచి ప్రారంభమవుతుంది. ఖమ్మం రిక్కాబజార్ పాఠశాలలో నేటి నుంచి పదో తరగతి, ఈనెల 15వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ జవాబుపత్రాల మూల్యాంకనం మొదలవుతుందని డీఈఓ వెల్లడించారు.

జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌లో తల్లాడ విద్యార్థి



ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న ఉదయ్‌కిరణ్

తల్లాడ: నేషనల్ టెక్నాలజీ డే సందర్భంగా న్యూఢిల్లీలో గురువారం మొదలైన సైన్స్ అండ్ టెక్నాలజీ ఎగ్జిబిషన్‌లో తల్లాడకు చెందిన బాలభారతి విద్యాలయం విద్యార్థి తాళ్లూరి ఉదయ్‌కిరణ్ పాల్గొన్నాడు. గతంలో జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు పొందిన ఉదయ్‌కిరణ్‌కు ఢిల్లీలోని ప్రగతి భవన్‌లో జరిగే ఎగ్జిబిషన్‌లో పాల్గొనే అవకాశం దక్కింది. ఆయన రూపొందించిన చిల్లీ బ్యాగ్ ఫిల్లింగ్ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించగా బాలభారతి కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

తల్లిపై ప్రేమతో మొక్కల పంపిణీ

అన్నపురెడ్డిపల్లి: తల్లిపై ప్రేమ చాటుకోవడంతోపాటు ఆమె జ్ఞాపకాలు నిలిచి ఉండేలా ఓ కొడుకు వినూత్నంగా మొక్కలు పంపిణీ చేశాడు. అన్నపురెడ్డిపల్లి మండలంలోని రాజాపురానికి చెందిన పుచ్చకాయల వెంకటేశ్వరరెడ్డి తల్లి సత్యవతి దశ దినకర్మ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన బంధువులు, గ్రామస్తులకు ఏపీలోని కడియం నుంచి తెప్పించిన పూలు, పండ్ల మొక్కలు పంపిణీ చేశాడు. ఆయా మొక్కలను వారు నాటి సంరక్షిస్తే తన తల్లి జ్ఞాపకాలు పదిలంగా ఉంటాయనే ఆలోచనతో పంపిణీ చేసినట్లు వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.



మొక్క పంపిణీ చేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి కుటుంబం

ఘనంగా ఐఏఎస్ అధికారుల వివాహం

కొణిజర్ల: వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ కుమారుడైన ఐఏఎస్ అధికారి బానోత్ మృగేందర్ లాల్ వివాహం మరో ఐఏఎస్ అధికారి శ్వేతాసుమన్‌తో గురువారం ఘనంగా జరిగింది. వీరిలో మృగేందర్ తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నంలో, శ్వేతాసుమన్ చిదంబరం జిల్లా జాయింట్ కలెక్టర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. కొణిజర్లలో ఈ వేడుక జరగగా మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు వారియర్, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోత్ హరిప్రియ, పొదెం వీరయ్య, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మేయర్ పునుకొల్లు నీరజ, జెడ్పీ, డీసీసీబీ, సుడా, మార్కెట్ చైర్మన్లు లింగాల కమల్‌రాజ్, కోరం కనకయ్య, కూరాకుల నాగభూషణం, విజయ్‌కుమార్, దోరేపల్లి శ్వేత తదితరులు వధూవరులను ఆశీర్వదించారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి పువ్వాడ